క్లుప్తంగా

ఘనంగా ఉరుసు ఉత్సవం



గంధాన్ని ఊరేగింపుగా మసీదుకు తీసుకెళ్తున్న ముస్లింలు

నాతవరం: వై.బి.పట్నంలో 24వ ఉరుసు ఉత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని హజరత్ సూఫీ షేక్ నిజాముద్దీన్ అబ్దుల్ సయ్యద్ ఖాదారి హౌలియ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఉత్సహంగా నిర్వహించారు. ముందుగా ముస్లింలు పురవీధుల్లో గంధాన్ని ఊరేగించి మసీదులోకి తీసుకెళ్లారు. ముస్లిం మహిళలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

మాడుగులలో శివ దీక్షలు ప్రారంభం



శివమాల ధరించిన భక్తులు

మాడుగుల: స్థానిక భీమలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం శివ మాలధారణ దీక్షలు ప్రారంభమయ్యాయి. శివపీఠం గురుస్వామి కర్రి ప్రకాష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆలయ ప్రధాన పూజారి సుబ్బారావు 25 మంది భక్తులకు శివమాలలు వేశారు.

సీపీఎం మండల కార్యదర్శిగా ముత్యాలనాయుడు



కె.కోటపాడు: సీపీఎం మండల కార్యదర్శిగా రొంగలి ముత్యాలనాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సోమవారం మండల కార్యవర్గం ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా ముత్యాలనాయుడుతో పాటు కమిటీ సభ్యులుగా యర్రా దేముడు, ఈర్లె నాయుడు బాబు, గాడి ప్రసాద్, వై.దేముడమ్మ, పి.రామలక్ష్మిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మోదకొండమ్మ ఆలయంలో చోరీ

బుచ్చెయ్యపేట: విజయరామరాజుపేట గ్రామ దేవత మోదకొండమ్మ ఆలయంలో చోరీ జరిగింది. సోమవారం ఉదయం గేటు తాళాలు విరగ్గొట్టి ఉండడం, అమ్మవారి అలంకరణ వస్తువులు చోరీ జరిగినట్లు భక్తులు గుర్తించారు. ఆదివారం అర్ధరాత్రి వరకు ఆలయంలో గ్రామస్తులు భజనలు చేసి వెళ్లగా.. ఉదయం లేచి చూసే సరికి చోరీ జరగడంపై గ్రామస్తులు విస్తుపోయారు. అర తులం శతమానాలతోపాటు అర కేజీ వెండి వస్తువులను పట్టుకుపోయారు. రూ.1.30 లక్షల వస్తువులు పట్టుకుపోయారని ఆలయ సంరక్షకుడు తిరుమల రెడ్డి వెంకటరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చిత్తులాటాడిన ఐదుగురిపై కేసు

గొలుగొండ: కసిమి గ్రామ సమీపంలో చిత్తులాటాడుతున్న ఐదుగురు నిందితులను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామారావు సోమవారం తెలిపారు. గ్రామ సమీపంలో చిత్తులాడుతున్నట్లు వచ్చిన సమాచారంతో దాడి చేసి పట్టుకున్నామన్నారు. వీరి నుంచి 5 సెల్‌ఫోన్లు, 11,250, మూడు బైకులు స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరిచామన్నారు. గొలుసు దుకాణాల కోసం గ్రామాల్లో వేలం నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఖండివరంలో మొక్కల పంపిణీ

చీడికాడ: ఉపాధ్యాయుడు కూండ్రపు సత్యం జ్ఞాపకార్థంగా సోమవారం ఖండివరంలో 600 మొక్కలు పంపిణీ చేశారు. ఆయన సంస్మరణ సభ సందర్భంగా కుటుంబ సభ్యులు వీటిని పంపిణీ చేశారు. విశాఖ డెయిరీ డైరెక్టరు శీరం రెడ్డి సూర్యనారాయణ, చోడవరం సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ కుచ్చు కళావతి, మాజీ సర్పంచ్ సింగంపల్లి ముత్యాల నాయుడు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ఎం.సన్నిబాబు, కోఆప్షన్ సభ్యుడు షేక్ సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు సుంకర కొండబాబు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడికి గాయాలు


గొలుగొండ: వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. సోమవారం సాయంత్రం ఆయన నర్సీపట్నం నుంచి గొలుగొండకు బైక్‌పై వస్తున్న క్రమంలో ఆరిల్లోవ అటవీ ప్రాంతంలో బోల్తా పడటంలో తలకు గాయాలయ్యాయి. వెంటనే ఇటువైపు వెళ్తున్న వారు నర్సీపట్నం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్యం అనంతరం మెరుగైన చికిత్స కోసం విశాఖకు తరలించారు.

జలనిధికి పుట్టినిల్లు

- మాడుగుల నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగు నీరందించే ప్రాజెక్టులు
- పంట కాలువలకు సీసీ లైనింగ్ లేక అవస్థలు
- ఆధునికీకరణ చేపట్టాలంటున్న రైతులు



పెద్దేరు జలాశయం



రైవాడ జలాశయం (ఫైల్)

మాడుగుల: జిల్లాలో అత్యంత వెనుకబడిన మాడుగుల నియోజకవర్గం జలనిధికి పుట్టినిల్లుగా విరాజిల్లుతోంది. ఇక్కడ ఏడు జలాశయాలు ఉండగా, వాటిలో నాలుగు అసంపూర్తిగా మిగిలిపోయాయి. నియోజకవర్గ ప్రజలకు వ్యవసాయమే జీవనాధారం.. కాని లక్ష ఎకరాలకు సాగునీరు, లక్షలాది మందికి దాహార్తిని తీర్చే రిజర్వాయర్లు ఆధునికీకరణకు నోచుకోవడం లేదు. దాంతో పచ్చని పైర్లతో సస్యశ్యామలంగా ఉండాల్సిన ఈ ప్రాంతం సాగునీటికి కటకటలాడుతోంది. ఈ ప్రాజెక్టుల సాగునీటి కాలువలకు సీసీలైనింగ్ పూర్తిస్థాయిలో చేయకపోవడంతో శివారు ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. కాలువల గట్లు కోతకు గురై సాగునీరు వృథాగా పోతోంది.

రైవాడ జలాశయం..
ఇది దేవరాపల్లి మండలం రైవాడ గ్రామం వద్ద రూ.22 కోట్లతో రిజర్వాయర్ నిర్మాణం చేపట్టారు. ఒకప్పుడు విశాఖ నగరానికి పూర్తిగా దాహార్తిని తీర్చేదిగా ఉండేది. ఇప్పటికీ విశాఖ నగరానికి తాగు నీరు అందిస్తోంది. 22 వేల ఎకరాలకు సాగు నీరందిస్తోంది. ఇది నియోజకవర్గంలోనే అతిపెద్ద జలాశయంగా పేరొందింది. దశాబ్దాలు రిజర్వాయర్ మరమ్మతులకు నోచుకోలేదు. సాగునీటి కాలువలు అధ్వానంగా ఉన్నాయి. శివారు ఆయకట్టుకు సాగు నీరందక రైతులు ఇక్కట్లు పడుతున్నారు.

కోనాం జలాశయం..
మాడుగుల నియోజకవర్గం చీడికాడ మండలం కోనాం గ్రామ సమీపంలో నిర్మించిన జలాశయం 14 వేల ఎకరాలకు సాగునీరందిస్తోంది. చీడికాడ, మాడుగుల, బుచ్చెయ్యపేట మండలాల్లో మెట్ట భూములకు వరదాయినిగా మారింది. అయితే దీని సాగునీటి కాలువలు కోతకు గురయ్యాయి. గట్లు బలహీనమై సాగునీరు సక్రమంగా పారడం లేదు. ఆయకట్టు రైతులకు ఏటా సాగునీటి కష్టాలు తప్పడం లేదు.

పెద్దేరు జలాశయం..
మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో మాడుగుల మండలంలో రావిపాలెం వద్ద పెద్దేరు జలాశయం జాతికి అంకితం చేశారు. ఈ ప్రాజెక్టు సమారు 15 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తోంది. రావికమతం, మాడుగుల మండలాల్లో భూములు సస్యశ్యామలం అవుతున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జలాశయం ప్రధాన కాలువల సీసీ లైనింగ్ ఏర్పాటు చేయడానికి రూ.84. 40 కోట్లు మంజూరు చేసింది. పనులు చేయాల్సి ఉంది.

తారకరామ జలాశయం (తాచేరు)...
ఇది మాడుగుల మండలంలో తాటిపర్తి వద్ద నిర్మాణం చేపట్టారు. జలాశయం గట్టు గతంలో తుపాన్లకు గండీ కొట్టింది. దాంతో 10 వేల ఎకరాలకు సాగు నీరందించాల్సిన ప్రాజెక్టు 4 వేల ఎకరాలతో సరిపెడుతుంది. గత ప్రభుత్వ హయాంలో అప్పటి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు జలాశయం కాలువల తలుపులు మరమ్మతులు చేపట్టారు. కొంతమేర కాలువలు బాగు చేశారు.

అసంపూర్తి జలాశయాలకు మరమ్మతులు చేపట్టాలి
మాడుగుల మండలంలో తారకరామ, పాలగెడ్డ, గొరిగెడ్డ, ఉరకగెడ్డ జలాశయాలు అసంపూర్తిగా ఉండిపోయాయి. వీటికి కొద్దిపాటి మరమ్మతులు చేపట్టి కాలువలకు సీసీలైనింగ్ చేస్తే రెండు పంటలు పండడంతోపాటు వందల ఎకరాలకు సాగునీరు పుష్కలంగా అందుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

ఆధునికీకరణ పనులు చేయాలి



మాడుగుల మండలంలో అసంపూర్తిగా ఉన్న జలాశయాలను ఆధునికీకరించాలి. వీటికి మరమ్మతులు చేపట్టి సీసీలైనింగ్ ఏర్పాటు చేస్తే వందల ఎకరాల మెట్ట భూములు సాగులోకి వస్తాయి. గిరిజన గ్రామాల్లో పంటలకు పుష్కలంగా సాగునీరు అందనుంది. ప్రభుత్వం దృష్టి సారించి రైతులను ఆదుకోవాలి.

– ఇరట నరసింహమూర్తి, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు

వన నర్సరీల్లో లక్ష మొక్కల పెంపకం



మొక్కల సంరక్షణ పనుల్లో ఉపాధి వేతనదారులు

కె.కోటపాడు: వన నర్సరీల్లో లక్ష మొక్కల పెంపకం చేపడుతున్నట్లు సోషల్ ఫారెస్ట్ అధికారులు తెలిపారు. మండలంలో సింగన్నదొరపాలెం, కొత్తూరు, రామచంద్రపురం వన నర్సరీల్లో లక్ష మొక్కలను పెంచుతున్నారు. తెల్లమద్ది, కానుగ, నేరేడు, పనస, బాదం, దేవకాంచర, టేకు, నెమలి, ఫెల్టోఫారం, వేప తదితర మొక్కలను పెంచుతున్నారు. వీటికి సకాలంలో నీటి తడులను అందించడంతో పాటు మొక్కల మధ్యలో కలుపు తీత పనులను వేతనదారులు చేపడుతున్నారు. ఉపాధి నిధులు, ఎన్టీపీసీ, సేల్ ఆఫ్ సీలింగ్ నిధులతో వీటి పెంపకాన్ని చేపడుతున్నట్లు డీఎఫ్‌వో జి.లక్ష్మణ్ తెలిపారు.

8 నుంచి ప్రజా సమస్యలపై పోరాటం

సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

నర్సీపట్నం: ప్రజా సమస్యలపై వచ్చే నెల 8 నుంచి 15వ తేదీ వరకు పోరాటాలు సాగిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం తెలిపారు. సోమవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ విద్యుత్‌తోపాటు చమురు చార్జీలు పెంచి ప్రజలపై అదనపు భారం మోపారన్నారు. వంట నూనెలు, కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని వాపోయారు. ఉద్యోగాలు లేక నిరుద్యోగులు రోడ్డున పడ్డారని, కార్మికులకు కనీస వేతనాలు అమలు కావటం లేదన్నారు. ఉద్యోగ భద్రత లేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని విమర్శించారు. జిల్లా కమిటీ సభ్యులు రుత్తల శంకరరావు, అడిగర్ల రాజు, సీనియర్ నాయకులు త్రిమూర్తుల రెడ్డి, ఈరెల్లి చిరంజీవి, కె.వి.సూర్యప్రభ, ఆర్.అప్పలనాయుడు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో రాజకీయం తగదు

సరుగుడు గ్రామసభలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి



మాట్లాడుతున్న ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి

నాతవరం: అర్హత ఉన్న ప్రతి గిరిజనుడికి సంక్షేమ పథకాలు అందించాలని, ఇందులో రాజకీయం చేయడం తగదని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి తెలిపారు. సోమవారం సరుగుడు గ్రామ సచివాలయం వద్ద ఉపాధి హామీ అధికారులు, సర్పంచ్ గంగరాజు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ముందుగా ఉపాధి పనులపై అధికారులు వివరించారు. ఎంపీపీ లక్ష్మణమూర్తి మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ హయాంలో రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించామన్నారు. ఇప్పుడు కూటమి నేతలు రాజకీయాలు చేసి గిరిజనులకు సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు ఆటంకం కలిగిస్తే గ్రామసభలో తాము చాలా పనులు వ్యతిరేకిస్తామన్నారు. సరుగుడు సర్పంచ్ గంగరాజు, నర్సీపట్నం ఏఎంసీ మాజీ డైరెక్టరు బండి గంగరాజు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పత్తి శ్రీను, మాజీ సర్పంచ్ పట్టెం రాజుబాబు పాల్గొన్నారు.

విద్య, ఆరోగ్యం ముఖ్యం



నోట్ పుస్తకాలు తనిఖీ చేస్తున్న ఎంఈవో వరహాలబాబు

నాతవరం: విద్యతో పాటు విద్యార్థులకు ఆరోగ్యం చాలా ముఖ్యమని ఎంఈవో -2 కామిరెడ్డి వరహాల బాబు ప్రధానోపాధ్యాయుడికి సూచించారు. చమ్మచింత ఎలిమెంటరీ పాఠశాలను సోమవారం ఎంఈవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేశారు. కొంతమందితో లెక్కలు చేయించారు. నోట్ పుస్తకాలను తనిఖీ చేశారు. వారి ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. మధ్యాహ్న భోజనం రుచి చూశారు. విద్యార్థుల నుంచి ఫిర్యాదులు వస్తే నిర్వాహకులపై చర్యలు ఉంటాయన్నారు.

తాగునీటి వనరుల క్లోరినేషన్



మాట్లాడుతున్న ఎంపీడీవో నాగేశ్వరరావు

రోలుగుంట: తాగునీరు కలుషితం కాకుండా అవసరమైన నియంత్రణ చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో వి.ఎస్. నాగేశ్వరరావు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, గ్రామ స్థాయి వైద్య సిబ్బంది, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు కలుషితమైన తాగునీటిని తాగడం వల్ల రోగాలు వచ్చే వీలుందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని తాగునీటి వనరులను విధిగా క్లోరినేషన్ చేయాలన్నారు. వచ్చే నెల ఒకటో తేదీన ఉదయం 5:30 గంటలకే లబ్ధిదారుల ఇల్లు తలుపు తట్టి పింఛన్లు పంపిణీ చేయాలన్నారు.

స్కాలర్‌షిప్ మంజూరు చేయాలని ధర్నా



ధర్నా చేస్తున్న విద్యార్థులు

చోడవరం: పెండింగ్ స్కాలర్ షిప్ వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద విద్యార్థులు ధర్నా చేశారు. విద్యా దీవెన, వసతి దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలకు సంబంధించిన స్కాలర్ షిప్‌ను మంజూరు చేయకపోవడంతో కాలేజీలు, స్కూళ్ల యాజమాన్యాలు ఫీజులు కట్టాలని విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నాయని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం. రమణ వాపోయారు. కొత్త ప్రభుత్వం నేటికీ స్కాలర్‌షిప్ మంజూరు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే చర్యలు తీసుకోకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తహసీల్దార్ రామారావుకు వినతిపత్రం అందజేశారు.

కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆందోళన



కమిషనర్ సురేంద్రకు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

నర్సీపట్నం: ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. కమిషనర్ జంపా సురేంద్రకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రుత్తల శంకరరావు మాట్లాడుతూ మున్సిపల్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనాలు రూ.28 వేలు ఇవ్వాలన్నారు. జనాభాకు తగినట్టుగా కార్మికుల సంఖ్య పెంచాలన్నారు. హెల్త్ కార్డులు, పనిముట్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రమణ, రాజు, బాబూరావు, దుర్గా తదితరులు పాల్గొన్నారు.

విశాఖ డెయిరీ పాల రైతుల ధర్నా నేడు



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న సీపీఎం మండల కార్యదర్శి నర్సింహమూర్తి

మాడుగుల రూరల్/బుచ్చెయ్యపేట/చోడవరం/కె.కోటపాడు: పాల ధరను తగ్గించి రైతుల నడ్డివిరచడం డెయిరీకి తగదని ఏపీ రైతు సంఘం బుచ్చెయ్యపేట మండల కార్యదర్శి పినపాత్రుని సాంబశివరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పి.వి.ఎస్.ఎన్ రాజు తెలిపారు. ఆవు పాల ధరను తగ్గించడంపై వారం రోజులుగా ఆందోళనలు చేస్తున్న బంగారుమెట్ట, బుచ్చెయ్యపేట పాడి రైతులను సోమవారం వీరు కలిసి తమ సంఘీభావం తెలిపారు. పాల ధర తగ్గింపుపై మంగళవారం గాజువాక విశాఖ డెయిరీ వద్ద చేపట్టిన ధర్నా విజయవంతం చేయాలని కోరుతూ ఏపీ రైతు సంఘం నాయకులు చోడవరం, వెంకన్నపాలెం, గజపతినగరం, జుత్తాడ, నర్సాపురం, దుడ్డుపాలెం గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. రైతు సంఘం నాయకులు ఎస్వీ నాయుడు, శరగడం అప్పారావు, పీలా రామఅప్పారావు, తదితరులు పాల్గొన్నారు. విశాఖ డెయిరీ వద్ద తలపెట్టిన ధర్నాకు సంబంధించిన గోడపత్రికలను కె.కోటపాడులో రైతులతో కలిసి సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గండి నాయినిబాబు ఆవిష్కరించారు. యర్రా దేముడు, గాడి ప్రసాద్, సూర్యనారాయణ, రామలక్ష్మి పాల్గొన్నారు. వీరనారాయణం పాల సొసైటీ వద్ద ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను పాడి రైతులతో కలిసి సీపీఎం మాడుగుల మండల కార్యదర్శి ఇ. నర్సింహమూర్తి విడుదల చేశారు.

రీసర్వే అర్జీలకు 15 రోజుల్లోగా పరిష్కారం



గుల్లేపల్లిలో అర్జీలను స్వీకరిస్తున్న మండల సర్వేయర్ రామచంద్రమూర్తి

కె.కోటపాడు: రీసర్వే గ్రామసభల్లో వచ్చిన అర్జీలకు 15 రోజుల్లోగా పరిష్కారాన్ని చూపనున్నట్లు మండల సర్వేయర్ రామచంద్రమూర్తి తెలిపారు. సోమవారం గుల్లేపల్లిలో రీసర్వే గ్రామసభ నిర్వహించారు.
ఈ సందర్భంగా పట్టాదారు పాస్ పుస్తకాల్లో పేర్ల నమోదు, ఆధార్, భూ విస్తీర్ణం, భూస్వభావంలో మార్పులు, తదితర సమస్యలపై 26 మంది అర్జీలందించారు. సర్పంచ్ బండారు దేముళ్లు, ఎంపీటీసీ కశిరెడ్డి దేముడుబాబు, వీఆర్వో సూర్యనారాయణ పాల్గొన్నారు.

లోవ కొత్తపల్లిలో..
మాడుగుల రూరల్: జాలంపల్లి గ్రామ పంచాయతీ లోవ కొత్తపల్లిలో రీసర్వే రెవెన్యూ గ్రామసభ సోమవారం నిర్వహించారు. రీసర్వే డి.టి. గణపతిరావు మాట్లాడుతూ రీసర్వేలో జరిగిన తప్పులు, ఒప్పుల సవరణలకు రాతపూర్వకంగా తెలియపరిస్తే, 15 రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. గ్రామసభలో 6 అర్జీలు రైతులు అందజేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు కిముడు రమణమ్మ, మండల సర్వేయరు జగదీష్, వీఆర్వో వెంకటరమణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పశుగ్రాస సాగుతో ఆదాయం రెట్టింపు



మాట్లాడుతున్న ఏడీ చిట్టినాయుడు

మాడుగుల రూరల్: పాడి రైతులు తమ ఆదాయాన్ని రెట్టింపు చేసుకోవాలంటే విరివిగా పశుగ్రాస సాగు చేపట్టాలని మాడుగుల ఏరియా పశు వైద్యశాల ఏడీఏ డాక్టర్ వి.చిట్టినాయుడు తెలిపారు. కె.జె.పురం -2 పాల సొసైటీ వద్ద సోమవారం రాత్రి పాడి రైతులకు ఆయన అవగాహన కల్పించారు. పాలు, మాంసం, గుడ్ల ఉత్పత్తి ప్రతి ఏటా 15 శాతం పెంచేందుకు పాడి రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పశువైద్యాధికారి మణిలక్ష్మణ్, సర్పంచ్ జామి రమణబాబు, ఎంపీటీసీ సభ్యుడు భీశెట్టి శ్రీనివాసరావు, పాల సొసైటీ అధ్యక్షుడు యల్లపు వెంకట శ్రీనివాసరావు, పశుసంవర్ధక శాఖ సహాయకుడు రమేష్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మాకవరపాలెం: గిడుతూరు వరాహ నదిలో అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నామని ఎస్ఐ దామోదర్‌నాయుడు సోమవారం తెలిపారు. దీనిని స్టేషన్‌కు తరలించామని, చర్యలు తీసుకుంటామన్నారు.

వైద్య సేవలపై టాస్క్‌ఫోర్స్ ఆరా



లచ్చన్నపాలెం విలేజ్ హెల్త్ క్లినిక్‌ను సందర్శిస్తున్న టీం సభ్యులతో వైద్య సిబ్బంది

మాకవరపాలెం: బూరుగుపాలెం పీహెచ్‌సీ పరిధి లచ్చన్నపాలెం విలేజ్ హెల్త్ క్లినిక్‌ను సోమవారం టాస్క్‌ఫోర్స్ సభ్యులు పరిశీలించారు. క్లినిక్ పరిధిలో వైద్య సిబ్బంది అందిస్తున్న సేవలు, రికార్డుల నిర్వహణ, తదితర అంశాలను తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న సేవలు, 19 ఏళ్ల లోపు బాలికలకు చేపడుతున్న రక్త పరీక్షలకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్లినిక్‌లోనే గర్భిణులు, బాలింతలు, బాలికలతో మాట్లాడి వారి నుంచి వివరాలు సేకరించారు. మెరుగైన వైద్య సేవలు అందించేలా పలు సూచనలు చేశారు. టీం సభ్యులు డాక్టర్ లూసీ, జగదీష్, రామచంద్రరావు, బూరుగుపాలెం వైద్యాధికారి చరిష్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలన్నీ అమలు చేయాల్సిందే..

సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వెంకన్న



పార్టీ మహాసభలో పాల్గొన్న వెంకన్న, తదితరులు

కె.కోటపాడు: సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలన్నింటినీ ఒకేసారి అమలు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు డి.వెంకన్న డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సీపీఎం మండల స్థాయి మహాసభలో ఆయన మాట్లాడారు. సూపర్ సిక్స్ పథకాలను అమావాస్యకు ఒకటి, పున్నమికి మరొకటి అన్న చందంగా ప్రకటిస్తుండడం హామీలను విస్మరించడమేనని విమర్శించారు. రీసర్వే గ్రామసభల్లో వచ్చిన అర్జీలకు పరిష్కారాన్ని చూపాలన్నారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీ ద్వారా చెరకు టన్ను ఒక్కింటికి మద్దతు ధర రూ.4 వేలు అందించాలన్నారు. పార్టీ నాయకులు యర్రా దేముడు, రొంగలి ముత్యాలనాయుడు, గాడి ప్రసాద్ పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల ఆందోళన



మాట్లాడుతున్న అధ్యక్షులు శ్రీనివాసరావు

నర్సీపట్నం: స్థానిక ఎల్ఐసీ కార్యాలయం వద్ద సోమవారం ఏజెంట్లు ఆందోళన చేశారు. ఏజెంట్ల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు గంటా శ్రీనివాసరావు, కూరాకుల శ్రీనివాసరావు మాట్లాడుతూ పాలసీలపై బోనస్ పెంచి, జీఎస్టీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాలసీలను పాత పద్ధతిలోనే కొనసాగించాలన్నారు. పాలసీదారుల రుణాలపై వడ్డీ తగ్గించాలన్నారు. గ్రూప్ ఇన్సూరెన్స్ రూ.25 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఆందోళనకు ఐసీఏయూ బేష్ యూనిట్ అధ్యక్షుడు కె.కె.వి.పడాల్, ఎల్ఐసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అధ్యక్షుడు సోమిరెడ్డి ధనార్జన, ఎల్ఐసీ ఉద్యోగ సంఘాలు సంఘీభావం తెలిపాయి. యూనియన్ జాయింట్ సెక్రటరీ అల్లు ప్రకాష్, కోశాధికారి ఎం.అప్పలనాయుడు పాల్గొన్నారు.

జనవరి 5న హిందూ మహాసభకు తరలి రావాలి

వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ



మాట్లాడుతున్న బంకుపల్లి

మాడుగుల రూరల్: హిందువులు ఐక్యతను చాటి చెప్పేందుకు, హిందుత్వానికి మద్దతుగా జనవరి 5న గన్నవరంలో నిర్వహించే హిందూ మహా సమ్మేళనానికి ప్రతి హిందువు తరలి రావాలని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు బంకుపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం కె.జె.పురంలో ఆయన మాట్లాడుతూ ఈ సమ్మేళనానికి ఐదు లక్షల మంది హిందూ కుటుంబ సభ్యులు హాజరవుతారన్నారు. వచ్చే నెల 9 నుంచి 15వ తేదీ వరకు గోపాష్టమి పూజలు మండలంలో అన్ని గ్రామాల్లో నిర్వహించాలని కోరారు. వీహెచ్‌పీ మండల అధ్యక్షులు రాపేట రామకొండలరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల కార్యదర్శి పెచ్చెట్టి కొండలరావు, మండల ధర్మ ప్రచారక్ చిరంజీవినాయుడు పాల్గొన్నారు.

పరిష్కార వేదికలో ఆక్రమణలపై ఫిర్యాదు

ఆర్డీవోకు 15 అర్జీలు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీవో రమణ

నర్సీపట్నం: అర్జీలను వెనువెంటనే పరిష్కరించాలని ఆర్డీవో వి.వి.రమణ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలపై 15 అర్జీలు వచ్చినట్టు తెలిపారు. అమరావతి స్కూల్ యాజమాన్యం టీసీ ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తుందని నర్సీపట్నానికి చెందిన పి.విజయదేవి ఫిర్యాదు చేశారు. చోడవరం మార్గంలో వాటర్ ట్యాంక్ వద్ద ఆక్రమణలపై అల్లూరి చారిటబుల్ ట్రస్ట్ వారు ఫిర్యాదు చేశారు. భర్త చనిపోయాడని, తనకు ఇద్దరు పిల్లలు, అనారోగ్యంతో ఉన్న మామతో ఇబ్బంది పడుతున్నానని, ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందించాలని ఎ.దేవి అర్జీ పెట్టుకుంది. భూ ఆక్రమణలు తదితర సమస్యలపై ఫిర్యాదు వచ్చాయి.

జనవాసాల మధ్య మద్యం షాపు

- కలెక్టర్‌కు దేవరాపల్లి వాసుల ఫిర్యాదు



దేవరాపల్లి ఆంధ్ర వీధిలో మద్యం షాపు

దేవరాపల్లి: స్థానిక ఆంధ్రవీధిలో జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన మద్యం షాపును తరలించాలని స్థానికులు కలెక్టరేట్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. మందుబాబులు మద్యం మత్తులో వీరంగం సృష్టించి, అఘాయిత్యాలకు పాల్పడే ప్రమాదం ఉన్నందున సమీపంలో మహిళలు, వృద్ధులు ఆందోళన చెందుతున్నారని, తక్షణమే అక్కడి నుంచి వేరొక చోటకు మార్పు చేయాలని కోరారు.